ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 22 ఏప్రిల్ 2025



## కుష్టు వ్యాధి రహిత సమాజానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న కుష్టు నివారణ బృందం

సుల్తానాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సభ్యులు అన్నారు. గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సోమవారం రాష్ట్ర బృందం సందర్శించింది. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి ఎండీటీ డ్రగ్ ద్వారా చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని సభ్యులు పేర్కొన్నారు. చికిత్స ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. కుష్టు వ్యాధి సర్వే (ఎల్‌సీడీసీ) గురించి వివరించారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి సలహాలు సూచనలు అందించారు. రాష్ట్ర బృందం వెంకటేశ్వరచారీ, సాకేత రెడ్డి, సుందర్‌తో పాటు పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి అన్న ప్రసన్న కుమారి, దేవీ సింగ్, రమేష్, డాక్టర్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మే 20న సమ్మెను విజయవంతం చేయండి



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం గోదావరిఖని సీఐటీయూ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ నాయకులు జమీల్, సునీల్, ముత్యంరావు, రాజన్న, నరేష్, విశ్వనాథ్ మాట్లాడుతూ దశాబ్దాల పాటు కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న హక్కులను, చట్టాలను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతూ మతోన్మాద చర్యల ద్వారా కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్త సమ్మెలో అన్నీ రంగాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు చంద్రశేఖర్, కుమారస్వామి, వైకుంఠం, నాగ మణి, అబ్దుల్ కరీం, మెండె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పంటలకు సాగునీరు అందించాలి

జూలపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరుతడి పంటలకు సాగు నీటిని అందించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతికందిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొప్పుల మహేష్, గుడిపాటి సంతోష్ రెడ్డి, మెరుగు రమేష్, పలువురు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### ప్రశాంతంగా ఓపెన్‌స్కూల్ పరీక్షలు

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌స్కూల్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి అన్నారు. ఈనెల 20 నుంచి 26వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30వరకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఎస్‌ఎస్‌సీకి ఒక పరీక్షకేంద్రం, ఇంటర్మీడియట్‌కు 3పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు 4సెంటర్లను సందర్శించారని, 10వ తరగతి పరీక్షకు 286మంది విద్యార్థులు హాజరయ్యారని, ఇంటర్ పరీక్షకు 621మంది విద్యార్థులు హాజరు కావల్సి ఉండగా 562మంది హాజరయ్యారన్నారు. పరీక్షలు సజావుగా జరిగాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మాల్‌ప్రాక్టిస్ జరగలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

### వడ దెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అంతర్గాం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగరీత్యా, పనుల కోసం బయట తిరిగే సమయంలో వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. వేసవిలో తరుచూ నీళ్ళు తాగుతూ, తలకు రుమాలు ధరించాలని పేర్కొన్నారు. వడదెబ్బకు గురైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని పేర్కొన్నారు. తహసీల్దార్ తూము రవీందర్ పటేల్, ఎంపీడీఓ వేణు మాధవ్, రమేష్, నర్సమ్మ, కరుణాకర్, రవీందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గోదావరి నీటి శుద్ధికి కార్యాచరణ

- రామగుండంలో ఐదు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు...
- అమృత్ 2.0 నుంచి నిధులు మల్కాపూర్, రామగుండం, ఫైవింక్లయిన్, జనగామలలో నిర్మాణం
- ఐదేళ్ల పాటు ఏజెన్సీలకే నిర్వహణ బాధ్యతలు



మల్కాపూర్ వద్ద ఎస్‌టీపీ నిర్మాణం

గోదావరిలో కలుస్తున్న వ్యర్థ జలాలు

కోల్‌సిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరి జలాలు పారిశ్రామిక, పట్టణ వ్యర్థాలతో కలుషితమై గరళంగా మారాయి... తాగేందుకు అటుంచి కనీసం స్నానాలకు కూడా పనికిరావని కాలుష్య నియంత్రణ మండలి నివేదికలు ఇచ్చింది. అయినప్పటికీ గోదావరి నుంచే మిషన్ భగీరథ ద్వారా గ్రామ గ్రామానికి తాగునీరు సరఫరా జరుగుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ దాహార్తి తీర్చేందుకు ఈ జలాలే ఆధారం. ఈ పరిస్థితుల్లో గోదావరి నదిని కాలుష్యం నుంచి కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించాయి. దానిలో భాగంగా రామగుండంలో ఐదు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టీపీ) నిర్మించనున్నారు. ఈ మేరకు అమృత్ 2.0 నుంచి రూ.88కోట్ల నిధులు మంజూరయ్యాయి. మొత్తంగా రామగుండం నుంచి ఎలాంటి వ్యర్థాలు గోదావరిలో నేరుగా కలువకుండా శుద్ధి చేసిన తరువాత క్లోరినేషన్ చేసి నదిలోకి పంపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగా అత్యాధునిక ఎస్‌బీఆర్ టెక్నాలజీతో ఐదు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మిస్తున్నారు.

### ఐదేళ్ల పాటు ఏజెన్సీదే నిర్వహణ

రామగుండంలో కొత్తగా నిర్మిస్తున్న ఎస్‌టీపీ నిర్వహణ బాధ్యతను ఐదేళ్లపాటు నిర్మాణ సంస్థలకే అప్పగించనున్నారు. రామగుండంలో అమృత్ పనులను శోదా-ఐహెచ్‌పీ-ఏఎంఆర్ సంయుక్త భాగస్వామ్య సంస్థ నిర్వహిస్తుంది. ఈ సంస్థనే ఐదేళ్లపాటు ఎస్‌టీపీలను నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకుగాను రామగుండం పాలక సంస్థ సంబంధిత ఏజెన్సీతో అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుంది. అమృత్ పథకంలో నగరపాలక సంస్థ వాటా సొమ్మును నిర్వహణకు బదలాయించాల్సి ఉంటుంది.

### ఎస్‌టీపీల నిర్మాణం

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 52.5 మిలియన్ లీటర్ పర్ డే(ఎంఎల్‌డీ) సామర్థ్యంలో ఎస్‌టీపీలు నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే సింగరేణి సంస్థ రూ.19కోట్ల వ్యయంతో 17ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీని నిర్మిస్తుంది. రామగుండం పట్టణంలో గత ఏడాది డీఎంఎఫ్‌టీ నిధులతో 2ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీని వినియోగంలోకి తెచ్చారు. ఇప్పుడు అమృత్ నిధులతో 33.5 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఐదు ఎస్‌టీపీలను నిర్మిస్తున్నారు. మల్కాపూర్ లోని పాత ఎస్‌టీపీ స్థానంలో 21ఎంఎల్‌డీ సామర్థ్యం గల ఎస్‌టీపీని నిర్మిస్తున్నారు. రామగుండం 4ఎంఎల్‌డీల సామర్థ్యం గల మరో ఎస్‌టీపీ, ఫైవింక్లయిన్‌కాలనీ, అల్లూరుల్లో 6ఎంఎల్‌డీల సామర్థ్యం గల ప్లాంట్ నిర్మిస్తున్నారు. అదనంగా జనగామ చెరువు దిగువన గోదావరిలో నీరు కలిసే చోట 1.5ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్లాంట్, పాములపేటలో 1ఎంఎల్‌డీ గల ప్లాంట్ నిర్మించాల్సి ఉంది. పాములపేటలో వ్యర్థ జలాలు నేరుగా గోదావరిలో కలువకపోవడంతో అక్కడ ప్లాంట్‌పై మళ్లీ పునరాలోచన చేస్తున్నారు. గోదావరిఖని 60శాతం భాగమైన తిలక్‌నగర్, విఠల్‌నగర్, ఫైవింక్లయిన్, ఎల్‌బీనగర్, రాంనగర్, చంద్రశేఖర్ నగర్, కళ్యాణ్‌నగర్, అడ్డగుంటపల్లి, సీఎస్‌పీ కాలనీ, మల్లికార్జున్‌నగర్, సీతానగర్, రాంనగర్ ప్రాంతాల నుంచి నాలాలు 2ఏ మోరీ గుండా జనగామ చెరువులో కలుస్తాయి. జనగామ చెరువు పైభాగాన ఇప్పటికే సింగరేణి 17ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్‌టీపీ నిర్మిస్తుంది. ఈ ఎస్‌టీపీ శుద్ధి చేసిన జలాలు జనగామ చెరువులో కలుస్తాయి. అక్కడ దాని దిగువన మరో ఎస్‌టీపీని నిర్మిస్తున్నారు. ఎన్‌టీపీసీ ప్లాంట్‌తో

(మిగతా 8వ పేజీలో)

### మరో రూ.50కోట్ల నిధులు అందుబాటులోకి...

రామగుండంలో అమృత్ 2.0లో లెఫ్ట్ ఓవర్ పనుల కింద మరో రూ.50కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయి. డ్రైనేజీ లేని కాలనీలు, ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తారు. ఎస్‌టీపీలకు నీటిని మళ్లించేందుకు బాక్స్ పద్ధతిలో ఓపెన్ డ్రైన్ నిర్మాణం చేసుకునేందుకు వెసులుబాటు ఉంది. నగరంలోని ప్రధానమైన నాలాలను టీయూఎఫ్ఐడీసీ నిధులతో ఆధునీకరిస్తుండగా అమృత్ నిధులతో అడ్డగుంటపల్లి నుంచి 2ఏ మోరీ నాలాలను ఆధునీకరించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. మొదటి దశలో ఇండ్ల మధ్య నుంచి వచ్చే నాలాను ఆధునీకరించి చెత్తాచెదారం వేయకుండా, దుర్వాసన రాకుండా స్లాబు వేయాలనే ఆలోచన ఉన్నారు.

## రైతుల ప్రయోజనం కోసమే భూభారతి



ఎలిగేడు విద్యావనరుల కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎలిగేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం విద్యావనరుల కేంద్రంలో భూభారతిపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ వేణుతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూభారతి చట్టంలో కీలక అంశాలను పొందుపరిచి రైతులకు మేలుచేసే విధంగా రూపొందించారన్నారు. భూమి హక్కుల రికార్డుల్లో తప్పులు, రిజిస్ట్రేషన్ చేయడానికి ముందు సర్వే మ్యాప్, భూముల మ్యూటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ధాన్యం కొనుగోలు కేంద్రం, లాలపల్లిలో ఉపాధిహామీ పనులు, ఎంపీపీఎస్ పాఠశాల, నర్సాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కలెక్టర్ మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పనుల పురోగతి వివరాలు తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ఉపాధిహామీ పనుల ప్రదేశాలలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సుల్తాన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయురాలు వావిలాల సంధ్యారెడ్డిని కలెక్టర్ సత్కరించారు. ఎలిగేడు, నర్సాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్యాడి క్లీనర్ ఏర్పాటుచేయాలని కలెక్టర్ సూచించారు. నాణ్యత ప్రమాణాలు, తేమశాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని, వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, డియం శ్రీకాంత్, తహసీల్దార్ బషీరోద్దీన్, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ఏపీఎం సుధాకర్, ఏఓ ఉమాపతి, ఎంఈఓ నరేంద్రచారి పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యాలు ప్రభావిత ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. సోమవారం ఈడీసీ మిలీనియం హాలులో అధికారులు, ప్రభావిత ప్రాంతాల ప్రజలతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిశ్రమలకు ఈ ప్రాంతంలోని రైతులు, ప్రజలు సుమారు 73 వేల ఎకరాల భూమిని ధరాదత్తం చేశారని, వేలాది మంది ఉపాధిని కోల్పోయారన్నారు. ఎన్టీపీసీ కోసం భూమిని త్యాగం చేసిన ప్రతి భూనిర్వాసితుడికి సంస్థలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీలో పని చేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని, మెరుగైన వైద్యం అందేలా యాజమాన్యం చూడాలన్నారు. కాలుష్యం బారిన పడకుండా చుట్టు పక్కల ప్రాంతాలలో మొక్కలు నాటాలన్నారు. ప్రభావిత గ్రామాలు, డివిజన్లలోని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. రాజీవ్ రహదారిలోని సర్వీస్ రోడ్డును పూర్తి చేయాలన్నారు. ఆర్ ఎఫ్‌సీఎల్ ప్రభావిత ప్రాంత ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజ మాన్యం వీర్లపల్లి గ్రామాన్ని తరలించాలన్నారు. ఎల్కలపల్లి గేట్లను తొలగించి ఆ ప్రాంత ప్రజలకు సరైన రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. సూపర్ స్పెషల్ ఆసుపత్రి, పశు వైద్యశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) విజయ్ కుమార్ సిక్దర్, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారి సోమనాథ్, ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ ఈశ్వర్, ప్రజలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సింగరేణి బ్లాస్టింగ్‌లతో పల్లెలు విధ్వంసం



సమావేశంలో మాట్లాడుతున్న మానవ హక్కుల నేత లింగం రాజయ్య

రామగిరి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సింగరేణితో పల్లెలు విధ్వంసానికి గురవుతున్నాయని, గ్రామాల్లో సింగరేణి రహస్యంగా సర్వేలు చేపడుతుందని మానవహక్కుల నేత లింగం రాజయ్య అన్నారు. సోమవారం రాజాపూర్ గ్రామంలో ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ భూములను, ప్రభుత్వ పథకాలకు ప్రజలను దూరం చేసి కష్టనష్టాలకు సింగరేణి గురి చేసిందన్నారు. మూడు గ్రామాలకు చెందిన 708.16 గుంటలు సింగరేణి స్వాధీనం చేసుకొని తిరిగి అవార్డు రద్దు చేసిందన్నారు. అనంతరం రాజాపూర్, సిద్ధపల్లి గ్రామాలకు చెందిన రైతులకు సంబం ధించిన 88 ఎకరాల భూమి కావాలంటూ నోటీసుల ఇవ్వకుండా 24 ఎకరాల్లో సర్వే పనులు చేపట్టిందన్నారు. దీన్ని అడ్డుకొన్న మాజీ ప్రజాప్రతినిధులు ఐదుగురిపై అక్రమ కేసులు నమోదు చేసిందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. విభజించి పాలించే పద్ధతి చేపట్టి గ్రామంలో విభేదాలు సృష్టిస్తుందని విమర్శించారు. తమ హక్కులు కాపాడుకునే వరకు రాజాపూర్ గ్రామస్థుల ఐక్యతను చాటుకోవాలన్నారు. సింగరేణి నిబంధనల మేరకు నడుచుకోవడం లేదని, మంత్రి మాటలను సైతం కలెక్టర్ పెడచెవిన పెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. బ్లాస్టింగ్‌లు నిబంధనల మేరకు జరగడం లేదన్నారు. కాలుష్యం ప్రజలు, చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వానికి తప్పుడు నివేదికలను అందిస్తు సింగరేణి గ్రామస్థులకు అన్యాయం చేస్తోందన్నారు. రాజాపూర్ గ్రామాన్ని స్వాధీనం చేసుకొని పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ పాశం ఓదెలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## రేపటి నుంచి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

- డివిజన్‌లో 352 మందికి రూ.1.30 కోట్ల చెక్కులు

మంథని, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం నుంచి లబ్ధిదారుల ఇండ్ల వద్దనే పంపిణీ చేయనున్నట్లు పీఏ ఆకుల చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రోగులు పలు ఆసుపత్రుల్లో అనారోగ్యం తో చికిత్స పొంది ఆర్థిక సహాయం కోసం మంత్రి శ్రీధర్‌బాబు ఆఫీసు ద్వారా సీఎం సహాయం నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, పాలకుర్తి మండలాల్లోని 352 మంది లబ్ధిదారు లకు మంజూరు చేయించిన రూ. 1.30 కోట్ల విలువ చేసే చెక్కులను వారి ఇండ్ల వద్దనే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22న కమాన్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన 56 చెక్కులు, పాలకుర్తి మండలంలో 20 చెక్కులు, ఈనెల 26న రామగిరి మండలంలో 68 చెక్కులు, ముత్తారం మండలంలో 86, ఈనెల 27న మంథని టౌన్, మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన 106 చెక్కులు లబ్ధిదారులకు వారి ఇండ్ల వద్దనే పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

# సన్న బియ్యంతో సంతోషం

- బియ్యం కోసం రేషన్ దుకాణాల వద్ద రద్దీ
- విక్రయించకుండా సొంతంగా వాడుకుంటున్న లబ్ధిదారులు



సుల్తానాబాద్ పాతకెండా వద్ద రేషన్ షాపులో సన్న బియ్యం కోసం క్యూ (ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీపై లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. రేషన్ దుకాణాలలో దొడ్డు బియ్యాన్ని తీసుకుంటున్న లబ్ధిదారులలో చాలా మంది వాటిని తినకుండా అమ్ముకునేవారు. ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీతో ప్రజలు వాటిని గతంలో లాగా అమ్ముకోవడం లేదు. వాటిని తమ కుటుంబ అవసరాలకు ఉపయోగిస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యం వండుకుంటే ముద్ద ముద్దగా అయ్యేదని దాంతో వాటిని అమ్ముకునే వారనమన్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు సన్న బియ్యం రూ.3500 నుంచి రూ 4500 వరకు ఉంది. సామాన్యులు సన్న బియ్యం కొనలేని పరిస్థితి ఉంది. దీంతో లబ్ధిదారులకు ప్రభుత్వమే రేషన్ షాపుల్లో సన్నబియ్యాన్ని అందిస్తుండడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సన్న బియ్యం పొందిన లబ్ధిదారులు తమ సంతోషాన్ని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### హర్షం వ్యక్తం చేస్తున్న పేదలు

- పన్నాల రాములు, మాజీ ఎంపీటీసీ కందునూరిపల్లి



తెలుగుదేశం పార్టీ హయాంలో సీఎం ఎన్టీఆర్ కిలో రెండు రూపాయలకు బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు. అదే విధంగా పేదల కోసం సీఎం రేవంత్ రెడ్డి సన్న బియ్యంను పంపిణీ చేస్తున్నారు. పేద ప్రజలకు ఎంతో మేలు చేసే విషయం. గ్రామాలలో పేదలు ఎంతో సంతోషపడుతున్నారు. దేశానికే ఇది ఆదర్శంగా నిలిచిన పథకం.

### నెలకు పన్నెండు వందలు ఆదా..

- పోసాని శ్రీలత, చెరువు రోడ్డు



గతంలో దొడ్డు బయ్యం ఇవ్వడంతో వాటిని అమ్ముకుని సన్న బియ్యంను కొనుక్కునే వారం. దొడ్డు బియ్యం అమ్మడం ద్వారా 240 రూపాయలు వచ్చేవి. వాటికి తోడు మరో పన్నెండు వందలు కలిపితే ఇరవై ఐదు కిలోల సన్న బియ్యం బ్యాగ్ వచ్చేది. ప్రభుత్వం నేరుగా తమకు సన్న బియ్యం పంపిణీ చేయడం వలన ఎంతో మేలు జరుగుతుంది.

### సన్న బియ్యంతో పేదలకు మేలు

- కందునూరి సూరి, స్వర్ణకార వీధి



ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో పేదలకు మేలు అవుతుంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో దొడ్డు బియ్యం తింటున్నారు. ప్రస్తుతం సన్న బియ్యం ఇస్తుండడంతో ఎంతో ఇష్టంగా ఇంటిల్లిపాది తింటున్నారు.

# పట్టణ చెరువులకు మహర్దశ

- మున్సిపాలిటీ చెరువుల సుందరీకరణకు నిధులు మంజూరు
- అమృత్ 2.0 పథకం కింద ప్రజారోగ్య, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పనులు
- మూడు ప్యాకేజీల్లో పనులు
- టెండర్ల నిర్వహణకు కసరత్తు



సుందరీకరణ కానున్న జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోతె చెరువు

జగిత్యాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధమైన నీటి వనరులకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా చెరువుల పరిరక్షణ, అభివృద్ధి, సుందరీకరణ పనులపై కేంద్ర, రాష్ట్రాలు దృష్టి సారించాయి. రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో ఉన్న చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాయి. ఇందుకు అమృత్ పథకం 2.0 కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో చెరువులను సుందరీకరణ చేయడానికి శ్రీకారం చుట్టాయి. ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వ ర్యంలో పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబం ధించి డీపీఆర్ (డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్)కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయి. ఎంపికైన చెరువులన్నింటికి పనులు చేపట్టడానికి కసరత్తులు చేస్తోంది. మంజూరైన నిధులతో చెరు వు కట్టల బలోపేతం, పూడికతీత, చెత్తా చెదారం తొలగింపు, మురుగు నీరు చేరకుండా ఏర్పాట్లు చేయనున్నారు.

**● 142 చెరువుల అభివృద్ధి...**

రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీల్లో గల 142 చెరువులను రూ. 380.11 కోట్ల నిధులతో సుందరీకరణ జరపడానికి నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ. 162.43 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 183.12 కోట్లు, సంబంధిత మున్సిపాలిటీ వాటా రూ. 34.56 కోట్లుగా నిర్ణయించారు. కాగా మొదటి ప్యాకేజీ కింద ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గల 45 మున్సిపాలిటీల్లో 50 చెరువులను రూ. 132.45 కోట్లతో, రెండో ప్యాకేజీలో నల్గొండ మున్సిపల్ డివిజన్‌లోని 17 మున్సిపా లిటీల్లో 20 చెరువులను రూ. 54.73 కోట్లతో, మూడో ప్యాకేజీలో మహబూబ్‌నగర్, నిజామాబాద్, సంగారెడ్డి మున్సిపల్ డివిజన్‌లోని 68 మున్సిపా లిటీల్లో 72 చెరువులను రూ. 192.93 కోట్లతో సుందరీకరణ చేయడానికి నిధులు మంజూరు అయ్యాయి.

**● టెండర్ల దశలో పనులు...**

చెరువుల సుందరీకరణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. మొదటిసారి నిర్వహించిన టెండర్లకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండో సారి టెండర్లను ప్రభుత్వం పిలిచింది. మొదటిసారి టెండర్లను 2025 జనవరి 29వ తేదీన పిలవగా 2025 ఫిబ్రవరి 13వ తేదీ వరకు గడువు విధించారు. గడువు ముగిసినప్పటికీ టెండర్లకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. దీంతో 2025 మార్చి 26వ తేదీన రెండోసారి టెండర్లను పిలిచారు. ఏప్రిల్ 16వ తేదీ నాటికి తుది గడువు విధించింది. అయితే ఇంకా సంబంధిత టెండర్లను తెరవలేదు. టెండర్లను పూర్తి చేసే పనులను అధికారులు నిర్వహిస్తున్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో టెండర్లను తెరిచి మిగిలిన కసరత్తులు నిర్వహించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

**● చెరువులకు ఊపిరి...**

మున్సిపాలిటీల్లో గల పలు చెరువులు జీవకళను కోల్పోతున్నాయి. అలాంటి చెరువుల్లో పూడిక తీత, గుర్రపు డెక్క పెరిగి మురుగు కాలువల నుంచి వచ్చే నీటితో చెరువు పరిసరాలు కంపు కొడుతున్నాయి. ఫలితంగా పట్టణప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందుకు అమృత్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుందరీకరణ జరపడానికి ముందుకు వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం మేరకు చెరువుల సుందరీకరణ పూర్తయితే పట్టణ ప్రాంతాల్లో గల చెరువులు కొత్త కళను సంతరించుకోనున్నాయి.



జగిత్యాల జిల్లా తాళ్ల చెరువు

**చెరువుల పునర్జీవానికి నిధులు మంజూరు**

-సంపత్‌రావు, ఈఈ,
ప్రజారోగ్య శాఖ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

చెరువుల పునర్జీవం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. సంబంధిత నిధులతో పనులు పూర్తి చేయడానికి టెండర్లను ఆహ్వానించగా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఇటీవల రెండోసారి టెండర్లను పిలిచారు. టెండర్లు దాఖలు చేయడానికి గడువు ముగిసింది. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసే పనులను నిర్వహిస్తున్నాము. ఈ నిధులతో పనులు పూర్తయితే పట్టణ చెరువులు కొత్త అందాలతో మెరుస్తాయి.

# విద్యుత్ మీటర్ పొందండిలా..



గణేశ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారు విద్యుత్తు మీటరు పొందడం, పేరు మార్పిడి గురించి అవగాహన లేక ఇబ్బంది పడుతుంటారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. మీటరు కావాల్సిన వారు నేరుగా మీ-సేవ కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ శాఖ సూచించిన రుసుము చెల్లించి మీటరు తీసుకోవచ్చు.

**● దరఖాస్తుతోపాటు జత చేయాల్సిన పత్రాలు:**

- ఇంటి యజమాని ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు
- స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ దస్తావేజు పత్రాల జిరాక్స్, మున్సిపాల్టీ, గ్రామ పంచాయతీ నుంచి తీసుకున్న అనుమతి పత్రాలు
- కిలోవాట్‌కు కేటగిరీ-1 అయితే పట్టణం, నగర వాసులు 1,470, గ్రామీణ ప్రాంత వాసులు1,570, కేటగిరీ-2 అయితే పట్టణాలు, నగరంలో 2,495, గామీణ ప్రాంతాల్లో 2,095 రూపాయలు చెల్లించాలి.
- పేరు మార్పిడికి స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ దస్తావేజు జిరాక్స్ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు.
- బాండ్ పేపర్‌కు 100, ఇతర చార్జీలకు 195 రూపాయలు చెల్లించాలి.

## ఆటో, ద్విచక్రవాహనం ఢీ

● ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు



ఆటోలోనే మృతిచెందిన నాగరాజు

వీణవంక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు ఐలాబాద్ గ్రామలమధ్య ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనగా.. ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల వివరాలప్రకారం.. కరీంనగర్ కట్టరాంపూర్ చెందిన కర్నాల నాగరాజు తన ఆటో (ఎపి15టిసి 5802)లో వీణవంక నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్నాడు. అదేసమయంలో మర్రి రమేష్, మల్లేష్ ద్విచక్రవాహనం(ఎపి29బిఎల్0382)పై వీణవంకకు వస్తున్నారు. బైక్‌పై వేగంగా వస్తున్న రమేష్ ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటోను నడుపుతున్న నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై కూర్చున్న మల్లేష్‌కు, రమేష్‌కు తీవ్రగాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుడి భార్య దేవలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జ్యోతినగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బాపూజీనగర్‌కు చెందిన పేరాల ఈశ్వర్(59) చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈనెల 14న రాత్రి రామగుండంలో రైలుదిగి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో కమిషనరేట్ సమీపంలో ఆటోనుంచి కిందపడి తీవ్రంగాగాయపడ్డాడు. డ్రైవర్ ఆటోను నిర్లక్ష్యంగా నడుపుతున్న క్రమంలో డ్రైవర్ పక్కనే కూర్చుని ప్రయాణిస్తున్న ఈశ్వర్ కింద పడ్డాడు. తలకు బలమైన గాయమైన అతన్ని కరీంనగర్‌కు తర లించి చికిత్స చేయించారు. ఆరోగ్యపరిస్థితి విషమించడంతో ఈశ్వర్ ఆదివారం రాత్రి చనిపోయినట్లు ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. మృతుడి కుమారుడు హరీష్ ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ ఫజలుద్దీన్‌పై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

ముస్తాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామంలో చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందారు. కొండాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ రషీద్ (46) తన స్నేహితుడు ఎండీ బాబాతో కలిసి ఆదివారం రాత్రి పదకొండు గంటలకు గ్రామంలోని పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చెరువులో బురద గుంటలో చిక్కుకొని నీటిలో మునిగి రషీద్ మృతిచెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. రషీద్ భార్య షహనాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పుల బాధతో పవర్‌లూం కార్మికుడి ఆత్మహత్య



బలరాం (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవై. నగర్‌కు చెందిన బూర బలరాం (55) అనే పవర్‌లూం కార్మికుడు అప్పుల బాధతో సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణంలోని బీవై. నగర్‌కు చెందిన బూర బలరాం పవర్ లూం కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్నిపోషిస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్లకు దాదాపు రూ. 3లక్షల అప్పులు అయ్యాయి. ఈ అప్పులన్నీ పొదుపు సంఘాల్లో తీసుకొని చెల్లించలేని పరిస్థితి నెలకొనడంతో భార్యతో గొడవజరిగింది. సెల్‌ఫోన్ పగులగొట్టడంతో ఆమెఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అప్పులు చెల్లించలేని స్థితిలో ఉన్న బలరాం తీవ్రమనస్థాపంతో తన ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొంతసేపటికి భార్య వచ్చి చూడడంతో అప్పటికే భర్త బలరాం మృతిచెందాడు. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారికి తెలియజేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సంఘటనా స్థలానికిటౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్‌వెళ్లి మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టంకోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కుమారుడు బూర నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు.

## ఆన్‌లైన్ సెంటర్‌లే లక్ష్యం

● సైబర్ నేరాలులకు పాల్పడుతున్న ఒకరి అరెస్ట్
● ఎస్పీ మహేశ్ బి గీతే



సైబర్ నేరస్థుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేశ్ బి గీతే

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ సెంటర్‌లే లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితుడైన మహారాష్ట్రలోని భీవండికి చెందిన దాసరి మురళి(45) అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని ఎస్పీ మహేశ్ బి.గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిందితుడి అరెస్ట్ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మురళికి సహకరించిన నలుగురు నిందితులను గతంలోనే అరెస్ట్ చేశామన్నారు. దాసరి మురళిపై దేశ వ్యాప్తంగా ఎన్‌సిఆర్‌పిలో నమోదైన 38పిటిషన్‌లలో రూ. 45లక్షల మోసాలకు పాల్పడ్డాడన్నారు. భీవండికి చెందిన దాసరి మురళి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తుండగా విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడి ఎలాగైనా సులభమార్గంలో డబ్బులు సంపాదించాలని సైబర్‌నేరాలవైపు దృష్టి పెట్టాడన్నారు. తన స్నేహితులైన విలేష్ పటేల్, చిరగ్ రమేశ్, జితేంద్ర సోమాభాయ్, నిలేష్ జైసింగ్ తోకలిసి ఒక ముఠాగా ఏర్పడి దాసరి మురళి ఆన్‌లైన్ సెంటర్‌లను లక్ష్యంగా చేసుకొని నమ్మించి డబ్బులు కొట్టేయడం మొదలు పెట్టాడన్నారు. ఇదే విధంగా జిల్లాలోని వేములవాడ అర్బన్ మండలంలోని అగ్ర హారంలో గల ఒక ఆన్‌లైన్‌సెంటర్, సిరిసిల్లలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లను లక్ష్యంగా చేసుకొని మురళి మోసం చేశాడన్నారు. ఈ మేరకు బాధితులు వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ దర్యాప్తులో భాగంగా సాంకేతికత ఆధారంగా ముందుగా నలుగురు వ్యక్తులను గతంలోనే అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపగా పరారీలో ఉన్న దాసరి మురళిని కోరుట్ల వద్ద అరెస్ట్ చేశామ న్నారు. సైబర్ నేరస్థుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన వేములవాడ టౌన్‌సీఐ వీరప్రసాద్, ఎస్‌ఐ రమేశ్, ఆర్‌ఎస్‌ఐ జునైద్, కానిస్టేబుళ్లు ఇమ్రాన్, షమీలను ఎస్పీ అభినందించారు.

## వడదెబ్బతో మహిళ మృతి



ఐలమ్మ (ఫైల్)

శంకరపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఉడిగే ఐలమ్మ (55) అనే మహిళ వడదెబ్బతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్లింది. ఎండ తీవ్రతకు వడదెబ్బ తాకడంతో అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యం చేయించారు. సోమవారం తెల్లవారు జామున పరిస్థితి విషమించి మృతి చెందింది.

## స్వీట్ హౌస్, బేకరీల్లో తనిఖీలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు స్వీట్‌హౌజ్‌లు, బేకరీల్లో సోమవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని యజమానులకు 9వేల రూపాయల జరిమానా విధించారు. హోటళ్లు, స్వీట్‌హౌజ్‌లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చాట్ బండార్ తదితర షాపుల్లో నిరంతర సోదాలు చేపడుతామని వారు పేర్కొన్నారు. రమాకాంత్, అనిల్, శ్రీనివాస్, ప్రదీప్‌లున్నారు.

## గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ శ్రీధర్

జైపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన రాటే నగేష్, చౌతకారి శ్రీకాంత్ కాగజ్‌నగర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్లిఅక్కడ గుర్తుతెలియని వ్యక్తులనుంచి 500గ్రాముల గంజాయి కొనుక్కున్నారు. కొంతవారు సేవించి, మిగిలిన గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్‌లుగా చేసి ఒక ప్యాకెట్‌ను రూ.500 విక్రయిస్తున్నారని తెలిపారు. కొంత గంజాయిని విక్రయించి మిగిలిన గంజాయిని రాటేనగేష్‌వద్ద ఉంచినట్లు తెలిపారు. సోమవారం నగేష్, శ్రీకాంత్ గంజాయిని విక్ర యించడానికి రాగా ఇందారం గ్రామంలో ప్లాంటేషన్‌వద్ద ఉండగా పట్టుకున్నామన్నారు. వారివద్దనుంచి 102గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ఒకరి రిమాండ్

ఇల్లంతకుంట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన ఆకుల తిరుపతిని సోమవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. పొత్తూరు మానేరువాగులో గతనెల 31న ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ట్రాక్టర్‌లో ఇసుక నింపుతుండగా రెవెన్యూ అధికారులు దాడిచేశారు. తిరుపతి ట్రాక్టర్ ట్రాలీని అక్కడే వదిలిపెట్టి ఇంజన్ తీసుకొని వెళ్లిపోయాడు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ సురభి సత్యనారాయణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామసమీపంలో సోమవారం తిరుపతిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## తప్పిపోయిన బాలుడి అప్పగింత



తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ సృజన్‌రెడ్డి

కరీంనగర్‌క్రైం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన వీర్ల యాజుష్ దత్త(4) అనే బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. యాజుష్ దత్త సోమవారం ఆడుకుంటూ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. దారి తెలియక మానస మటన్ షాపు వద్దకు చేరుకున్నాడు. గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్‌చేశారు. అక్కడే విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ హోంగార్డు నర్సయ్య బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించాడు. అనంతరం బాలుడితో మాట్లాడి చిరునామా గుర్తించిన పోలీసులు క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా హోంగార్డు నర్సయ్యను టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి అభినందించారు.

## బతుకుదెరువు కోసం వెళ్లి.. అనంత లోకాలకు

● సౌదీ రోడ్డు ప్రమాదంలో కొత్తపేట వాసి మృతి



రాజేందర్ (ఫైల్)

ఎండపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం సౌదీకి వెళ్లి రోడ్డు ప్రమాదంలో ఎండపల్లి మండలం కొత్తపేటకు చెందిన బూట్ల రాజేందర్(40) మృతిచెందాడు. మృతుడి భార్య తెలిపిన వివరాల ప్రకారం రాజేందర్ మూడు సంవత్సరాల క్రితం సౌదీ వెళ్లాడు. సౌదీలో ఓ హోటల్‌లో పనిచేస్తున్న రాజేందర్ శుక్రవారం పార్సిల్ ఇవ్వడానికి సైకిల్‌పై వెళ్లగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అక్కడి హోటల్ యజమాని సౌదీలో పనిచేసే రాజేందర్ స్నేహితుడికి శనివారం సమాచారం అందించాడు. అతడు మృతుడి భార్య రజితకి సమాచారం ఇవ్వడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య రజిత ప్రభుత్వానికి విన్నవించారు.

## ఆటో డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్‌లైసెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి ప్రమాదానికి కారకుడైన సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన గోవిందుల నరేశ్ అనే ఆటో డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 6వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారు. సిరిసిల్ల టౌన్ సిఐ కె. కృష్ణ వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన ఒగ్గు భూమేశ్ నవంబర్ 23, 2018న రాత్రి 8.15గంటలకు మరమగ్గాల పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై రాజీవ్‌నగర్ నుంచి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో డ్రైవర్ అతివేగంగా నడుపుతూ ద్విచక్రవాహనానికి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భూమేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలుచేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ తొమ్మిదిమంది సాక్షులను ప్రవేశపెట్టగా పిపి సందీప్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించి నిందితుడిపై నేరం రుజువు కావడంతో ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ ఆటోడ్రైవర్ నరేశ్‌కు రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.6వేల జరిమానా, బాధితుడికి రూ. 50వేల పరిహారం ఇవ్వాలని తీర్పు ఇచ్చారు.

## దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట ,ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మోతె సతీష్, మోతె ఎల్లవ్వ, మోతె బాలమణిలపై కేసు నమోదుచేశామని ఎస్సై రమాకాంత్ సోమవారం పేర్కొన్నారు. గ్రామంలోని మోతె కిరణ్, అతని తల్లిదండ్రులు ఎల్లవ్వ, ఎల్లయ్యలు కలిసి జీవిస్తున్నారని తెలిపారు. గతంలో జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకొని ఈనెల 20న సతీష్, ఎల్లవ్వ, బాలమణి కలిసి కిరణ్ కుటుంబ సభ్యులపై దాడికి దిగారని చెప్పారు. కిరణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు తీవ్ర గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

# యువకుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో ఏర్పడిన పరిచయంతో అవసరానికి డబ్బులు ఇచ్చి తిరిగి ఇవ్వాలని అడిగితే వేధింపుల కేసునమోదు చేయించి జైలు పాలు చేయడం.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తనను పట్టుకునేందుకు పోలీసులు వెంబడిస్తున్నారనే భయంతో గడ్డి నరేందర్ అనే యువకుడు సోమవారం రాత్రి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధిత కుటుంబసభ్యులు, ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని ఓ మహిళకు గతంలోనే వివాహమైంది. మొదటి భర్త నుంచి దూరంగా ఉంటున్న ఆమెకు ఎల్లారెడ్డిపేటలోని ఓ యువకుడితో పరిచయం ఏర్పడి స్థానికంగా ఓ గదిని అద్దెకు తీసుకుని ఇద్దరు కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో ఆ మహిళకు గల్ఫ్‌లో ఉంటున్న రాచర్లబొప్పాపూర్‌లోని గడ్డి నరేందర్‌తో ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడింది. నరేందర్ గల్ఫ్‌లో ఉన్న సమయంలో మహిళకు డబ్బులు పంపించాడు. స్వగ్రామానికి వచ్చిన ఆయన మహిళను డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఆమెతో సహజీవనం సాగిస్తున్న యువకుడు తనతో ఉన్న మహిళను నరేందర్ వేధింపులకు గురి చేస్తున్నాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కేసు నమోదు చేసిన పోలీసులు నరేందర్‌ను రిమాండ్‌కు తరలించారు. 45రోజుల పాటు జైలు జీవితం గడిపిన ఆయన ఇటీవల విడుదలయ్యాడు. నరేందర్ తండ్రి గడ్డినర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తాను ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని మహిళను కోరడంతో ఆమెతో కలిసి ఉంటున్న యువకుడు తిరిగి నరేందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహిళను వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు అందడంతో ఆందోళనకు గురైన యువకుడు ఎల్లారెడ్డిపేటలో అద్దెకుఉంటున్న మహిళఇంటి సమీ పానికి బైక్‌పై చేరుకుని పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టు పక్కల వారు గమనించి మంటలను ఆర్పి ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వానుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మహిళతో పాటు పోలీసులవల్లే తమకొడుకు ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబసభ్యులు ఆరోపించారు.

ఈ విషయంపై స్థానిక ఎస్‌ఐ రమాకాంత్‌ను వివరణకోరగా యువకుడు నరేందర్ మహిళ ఇంటి ఎదుట ఇబ్బందికరంగా వ్యవహరించడం తమకుఅందిన ఫిర్యాదు మేరకు ఇద్దరు పోలీసులు అక్కడకు చేరుకున్నారని తెలిపారు. అప్పటికే యువకుడు అక్కడ నుంచి పారిపోయాడని చెప్పారు. పోలీసులు వెంబడించడం వల్ల భయంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారనే ఆరోపణల్లో వాస్తవం లేదని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




● రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్న ఏఐ టూల్స్

చొప్పదండి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం పెద్దకుర్మపల్లికి చెందిన యువరైతు తిరుపతి వరి సాగు చేశాడు. గత కొద్ది రోజుల క్రిందట వరిలో మెడ విరుపు లక్షణలు కనిపించడంతో వెంటనే చాట్‌జీపీటీలో వరి పొలం ఫోటోను అప్‌లోడ్ చేశాడు. సమస్యకు పరిష్కారం కావాలని అడిగాడు. అంతే క్షణాల్లో చాట్‌జీపీటీలో మెడ విరుపు నివారణకు క్రిమిసంహారక మందులు, వరిలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు, సేంద్రీయ ఎరువులను సూచించింది. వెంటనే తిరుపతి ఎరువుల దుకాణానికి వెళ్లి క్రిమిసంహారక మందులను కొనగోలు చేసి పొలానికి పిచికారి చేశాడు. అతి తక్కువ ఖర్చుతో సమస్య పరిష్కారం అయ్యింది. అందరు రైతుల మాదిరిగా ఎరువుల దుకాణానికి వెళితే మూడు రకాల పురుగుల మందులు ఇస్తారని, ఖర్చు భారం పెరిగిపోతుందని, చాట్‌జీపీటీతో తక్కువ ఖర్చులో పొలానికి మందులు దొరికాయని చెబుతున్నాడు యువ రైతు తిరుపతి. వ్యవసాయంలో ఏఐ పరిజ్ఞానం రోజురోజుకు విస్తృతమవుతోంది.




● క్షణాల్లో సమాచారం

నేటి డిజిటల్ యుగంలో ఏఐ(కృత్రిమ మేధస్సు) అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని చూపిస్తుంది. వ్యవసాయంలో చాట్‌జీపీటీ, గూగుల్ జెమిని లాంటి ఏఐ ఆధారిత టూల్స్ రైతులకు క్షణాల్లో సమాచారాన్ని అందిస్తున్నాయి. రైతుల కార్యకలాపాల్లో మార్గదర్శకులుగా నిలుస్తున్నాయి. . రైతులకు పంటల ఎంపికలో సహాయం చేస్తూ భూమి తత్వం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితుల ఆధారంగా వేసుకునే పంటల సమాచారాన్ని అందిస్తున్నాయి. కాలానికి అనుగుణంగా సలహాలు ఇస్తున్నాయి యాప్‌లు.

● తెగుళ్లు, చీడపీడల గుర్తింపు...

రైతులు తమ పొలంలో పంటలకు వచ్చే తెగుళ్లను, చీడపీడలను గుర్తించవచ్చు. పంటల ఫోటోలను చాట్‌జీపీటీ, జెమిని యాప్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే వ్యాధులు, తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులు, నివారణకు చర్యలను సూచిస్తుంది. సేంద్రీయ ఎరువులను కూడా సూచిస్తుంది. వాటిని వాడే విధానాన్ని తెలియ జేస్తుంది. తెలుగు భాషలో స్పష్టంగా వివరాలను అందజేస్తాయి. చాట్ జీపీటీ, గూగుల్ జెమిని లాంటి ఏఐ టూల్స్ రైతులను డిజిటల్ ప్రపంచంలోకి చేర్చడమే కాకుండా సాంకేతికతను, ఆధునిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేస్తున్నాయి.

# దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యత

● భూమిపై ఆధిపత్యం కోసం మనిషి విచక్షణరహిత పనులు
● జిల్లాలో అంతరించిపోతున్న అడవులు, గుట్టలు....
● నేడు ధరిత్రి దినోత్సవం



కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. అభివృద్ధి మాటున భూమికి అనేక రకాల విఘాతం కలిగిస్తున్నాం. పరిశ్రమల ద్వారా ఉత్పన్నం అవుతున్న కాలుష్యం, చెట్ల నరికివేత, సహజ నిక్షేపాల వెలికితీత వంటివి భూమిని మరింత కుంగదీస్తున్నాయి. భూమికి కవచంలా ఉన్న ఓజోన్ పొరకు గ్రీన్‌హౌస్ వాయువులు తూట్లు పొడుస్తున్నాయి. పరిశ్రమలు విడుదల చేసే వాయువుల ప్రభావంతో వాతావరణంలో అసమానతలు ఏర్పడుతున్నాయి. మితి మీరిన టెక్నాలజీ వినియోగం ప్రకృతికి చేటుగా మారుతుంది. మనుషులు విచక్షణా రహితంగా చేస్తున్న పనుల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. దీని ఫలితంగా కొన్ని సందర్భాల్లో ప్రకృతి విలయ తాండవం చేస్తూ సునామీలు, అకాలవర్షాలు, పెనుతుఫాన్‌లు, భూకం పాలు చోటుచేసుకుంటున్నాయి. పర్యా వరణాన్ని మనం కాపాడితే అది తిరిగి మనల్ని పరిరక్షిస్తుంది. ప్రకృతికి హాని కలిగించే అనేక కార్యాకలాపాలను వెంటనే నిషేధించాల్సిన అవసరం ఉంది. ఈ హానికారక చర్యలు ఇలాగే కొనసాగితే... భవిష్యత్తు తరాల జీవనం అస్తవ్యస్తం అవుతుంది. భూమి మీద మనిషి మనుగడ ప్రశార్ధకంగా మారే అవకాశం ఉంటుంది. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ విషయాన్ని మనందరికీ గుర్తు చెయ్యడానికి ప్రతి ఏడాది ఏప్రిల్ 22న వరల్డ్ ఎర్త్ డే (ధరిత్రి దినోత్సవం) నిర్వహిస్తారు. ఈ రోజునే మదర్ ఎర్త్ డేగా పరిగణిస్తున్నారు.

● జిల్లాలో అంతరిస్తున్న అటవీప్రాంతం

కరీంనగర్ జిల్లాలో 429.772 హెక్టార్ల పరిధిలో ఫారెస్టు విస్తరించి ఉన్నది. కరీంనగర్ ఫారెస్టు డివిజన్‌లో 256.525 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉండగా ఇందులో గంగాధర మండలం వెంకటాయపల్లి, కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వాగు ప్రాంతంలో అటవీప్రాంతం విస్తరించి ఉంది. హుజూరాబాద్ ఫారెస్ట్ డివిజన్‌లో 173.247 హెక్టార్లు ఫారెస్టు ఉండగా రాయికల్ ప్రాంతాలనే అటవీ ప్రాంతం ఉంది. జిల్లా భూమి విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 33 శాతం ఉండాలి. జిల్లాలో 10 శాతంలోపే అటవీ ప్రాంతం ఉంది. రోడ్ల పక్కన, ఇళ్లల్లో, సీటీసీ మియావాకి, ఇతర ప్రాంతాల్లో ఉన్న చెట్లతో కలిపి జిల్లాలో గ్రీన్‌కవర్ 15 శాతం వరకు ఉంది. అటవీ ప్రాంత విస్తీర్ణం తగ్గిపోవటంతోపాటు వన్యప్రాణులకు సహజసిద్ధంగా లభించే ఆహారం దొరకకుండా పోతున్నది. ఇంకో వైపున సహజసిద్ధంగా ఏర్పడిన గుట్టలను తొలచి గ్రానైట్‌ను విదేశాలకు తరలిస్తూ బొందలగడ్డలుగా మారుస్తున్నారు.

● ధరిత్రి దినోత్సవ నేపథ్యం

పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించడమే ధరిత్రి దినోత్సవం ముఖ్యో ద్దేశం. మొదట ఐక్యరాజ్యసమితి 1969 మార్చిలో జాన్‌మెకెల్‌తో ఎర్త్ డేను ప్రారంభించింది. ఆ తర్వాత అమెరికా రాజకీయవేత్త గేలార్డ్ నెల్సన్ ప్రారంభించాడు. అమెరికా సెనేటర్ గెలార్డ్ నెల్సన్‌కి వచ్చిన ఆలోచనకు ప్రతిరూపమే ఈ ధరిత్రి దినోత్సవం. అందరికీ ధరిత్రి సంరక్షణపై అవగాహన కల్పించాలని నెల్సన్ నిర్ణయించుకున్నారు. వాతావరణంలో జరిగే మార్పులనూ వివరిస్తూ ఎంత జాగ్రత్తగా ఉండాలో, మన వంతుగా ఏమి చెయ్యాలో అందరికీ తెలియ చెప్పడానికి ఒక రోజంటూ ఉంటే బాగుంటుందని అనుకున్నారు. వెంటనే తన ఆలోచనకు రూపకల్పన చేస్తూ, ఒక వార్తాపత్రిక ద్వారా ప్రజలకూ ధరిత్రి దినోత్సవం గురించి వివరించారు. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఆరోజు అమెరికాలోని ప్రజలంతా ధరిత్రిని రక్షించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రమాణాలు చేశారు. ఇలా అమెరికాలో ప్రారంభమైన ధరిత్రి దినోత్సవం అనంతరం ప్రపంచవ్యాప్తమైంది. ప్రజల్లో మరింత అవగాహన కలిగించేందుకు ఎర్త్ డే నెట్‌వర్క్ ఏర్పడింది. ప్రపంచ ధరిత్రి దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 22న జరుపుకుంటారు. పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రి దినోత్సవం నిర్వహించారు.




# హరహర మహాదేవ

● భక్తజన సంద్రంగా మారిన వేములవాడ
● భక్తులతో కిక్కిరిసిపోయిన క్యూలు


భక్తులతో కిక్కిరిసిపోయిన రాజన్న ఆలయ ప్రాంగణం


రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు


వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):హరహరమహాదేవా.. శంభో శంకరా.. అంటూ భక్తులు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత పవిత్రమైన సోమవారం రోజున రాజన్నను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో కిక్కిరిసిపోయారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేములవాడకు తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కు క్యూలో భక్తులు గంటలతరబడి నిరీక్షించారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయప్రాంగణం కిక్కిరిసి పోయింది. ఈవోవినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరిండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# పరీక్షల నిర్వహణకు సహకరించం


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సుప్మా ఉమ్మడి జిల్లా నాయకులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో త్వరలో నిర్వహించనున్న సెమిస్టర్ పరీక్షలకు సహకరించబోమని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం తేల్చి చెప్పింది. సంఘం ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీ ఉన్నతాధికారులు, పరీక్షల నియంత్రణ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుప్మా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ మూడేళ్లుగా ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత ఇస్తే తప్ప పరీక్షలు నిర్వహించబోమన్నారు. బకాయిలు విడుదలలో జాప్యంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందని, అధ్యాపకుల వేతనాలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయించే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పరీక్షల బహిష్కరణ నిర్ణయాన్ని తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శి శ్రీపాద నరేష్, రవీందర్ రెడ్డి, అపూర్వ వేణు, ఇంద్రసేనారెడ్డి రవీందర్ శశాంక్, శ్రీనివాస్, రాజేందర్, కొలనూరు శేఖర్ రెడ్డి, గూగ్గిల జగన్ గౌడ్, ఎన్టీఆర్, భూమేష్, వేణు కుమార్ పాల్గొన్నారు.

# సైనిక్ స్కూల్‌లో బాక్స్ టెలిఫోన్


ఫోన్‌లో మాట్లాడుతున్న విద్యార్థి

చొప్పదండి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్‌లో బాక్స్ టెలిఫోన్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రాజెక్టు మిత్ర పేరుతో రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడేందుకు బాక్స్‌టెలిఫోన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా సోమవారం ప్రారంభించారు. ఈఫోన్లు ఏఐ ఆధారంగా పనిచేస్తాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ జి కాళహస్తి, శ్రీనివాస్, ప్రమోద్ రాజు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి నిధులు తీసుకొస్తా

● బ్లాక్ మెయిలింగ్ యూట్యూబర్లతో జర్నలిజానికి చెడ్డ పేరు
● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్


వేములవాడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

వేములవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఇందుకోసం ఈ ఏడాది కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని, హెల్త్ కార్డులు పనిచేయడం లేదని, డబుల్ బెడ్రూం ఇల్లు కలగానే మారాయన్నారు. ఈ సారి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. కొంతమంది జర్నలిజం అనుభవం లేకున్నా యూట్యూబ్ ఛానళ్ల ముసుగులో ఇష్టానుసారం వ్యక్తిగత దూషణలు చేస్తూ కుటుంబాలపై బురద చల్లుతూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బ్లాక్‌మెయిలింగ్ యూట్యూబర్లతో జర్నలిజానికి చెడ్డపేరు వస్తోందన్నారు. జర్నలిస్టు సంఘాలు, ప్రెస్‌క్లబ్ నిర్వాహకులు ఈవిషయంలో కఠినంగా ఉండాలని కోరారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ సమాజ హితం కోసం పనిచేసే యూట్యూబ్ ఛానళ్లను ఖచ్చితంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈవిషయంపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో త్వరలోనే సైనిక్ స్కూల్ ఏర్పాటు అయ్యేందుకు కృషి చేస్తానని అన్నారు. వేములవాడ ప్రెస్‌క్లబ్ భవనానికి గతంలో పది లక్షల రూపాయలు కేటాయించానని, త్వరలో మరిన్ని నిధులు కేటాయిస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్, బిజేయూ జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టెక్నాలజీ ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలి

● తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ వి బాలకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వి బాలకృష్ణారెడ్డి

గంభీరావుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా టెక్నాలజీని ఉపయోగించుకుని విద్యార్థులు అభివృద్ధి చెందాలని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ సెమినార్‌లో భాగంగా జనరేటివ్ ఏఐపై జాతీయ సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ వి బాలకృష్ణారెడ్డి మాట్లాడారు. ఎన్ఈపీకి అనుగుణంగా ఐసీటీలో ఏ1టెక్నాలజీని ఉపయోగించు కుని మారుమూల గ్రామాలలోని కళాశాలలను పట్టణకళాశాలల ధీటుగా అభివృద్ధి చేయవచ్చన్నారు. ఎలమంచి ప్రాజెక్ట్ హ్యాండ్లింగ్ గురించి ఐడియా జనరేషన్ రీసెర్చ్ మెథడాలజీ ఏఐద్వారా భవిష్యత్‌కు తగిన విద్యార్థులను తయారు చేయవచ్చని అన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు పరిశోధన నైతిక విలువలతో పాటు జ్ఞానం పెంపొందించుకోవచ్చని అన్నారు. డాక్టర్ కల్యాణి మాట్లాడుతూ విద్యార్థులు లిటరేచర్ రివ్యూ రీసెర్చ్ మెథడాలజీలో ఎలా చేయాలో వివరించారు. డాక్టర్ స్వాతి లాంగ్వేంజ్ ఏఐ టూల్స్ గురించి వివరించారు. హెంట్ మెట్రిక్ సీఈవో అయూబ్ షేక్ పిల్లల అసైన్‌మెంట్, అంటెండెన్స్, ఎక్సర్‌సైజ్, వాల్యూయేషన్ ఏఐ టూల్స్ ఉపయోగించి ఎలా చేయాలో వివరించారు. సెమినార్ అర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శ్రావణ్‌కుమార్, వివిధ కళాశాలల పరిశోధకులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిహారం రాలేదని పనులు అడ్డుకున్న రైతు

● రైతుపై దాడి చేసిన సైట్ ఇంజనీర్


దాడిలో చినిగిపోయిన చొక్కాతో మచ్చయ్య

శంకరపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో జాతీయ రహదారి విస్తరణ పనులను ఓ రైతు అడ్డుకోవడంతో సైట్ ఇంజనీర్ రైతుపై దాడిచేశాడు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాధి తుడు కాసు మచ్చయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు శివారులో కాసు కొంరయ్య, కాసు మచ్చయ్య అన్నదమ్ములకు వ్యవసాయ బావి ఉంది. వ్యవసాయ బావి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పోయింది. బావికి పరిహారం అందకపోవడంతో రైతు మచ్చయ్య రహదారి విస్తరణ పనులను అడ్డుకున్నాడు. అక్కడికి చేరుకున్న సైట్ ఇంజనీర్‌కు, మచ్చయ్యకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో సైట్ ఇంజనీర్ మచ్చయ్యపై దాడి చేసి నెట్టి వేయడంతో బావి పక్కకు పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. తనను దూషించి దాడిచేశారని సైట్ ఇంజనీర్‌పై మచ్చయ్య కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

# ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలి

● నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్


మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల పరిహారం అందించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్ గ్రామంలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సర్కార్ కంటే అధ్వానంగా రేవంత్ సర్కార్ పాలన చేస్తోందని విమర్శించారు. రైతులను ఆదుకోవడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అర్హులందరికీ రైతు భరోసా, రుణమాఫీ కాక ఇప్పటికే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోకపోవడం దౌర్భాగ్యమన్నారు. విపత్తులు సంభవించినప్పుడు ఫసల్‌బీమా రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీ తెలిపారు. గతంలో కేసీఆర్, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు దోచుకునుడే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన ఆరోపించారు. పాలన చేతకాకనే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అప్పులు ఉన్నాయని ఆరోపిస్తున్నాడని అర్వింద్ విమర్శించారు. కోరుట్ల నియోజకవర్గంలో వడగండ్ల వాన తీవ్ర నష్టం మిగిల్చిందన్నారు. 20వేల ఎకరాలు పంటనష్టం జరిగిందన్నారు. 60 శాతం ఇబ్రహీంపట్నం మండలంలో నష్టం వాటిల్లిందని తెలిపారు. పంటనష్టంపై జిల్లాకలెక్టర్‌కు, వ్యవసాయ శాఖ మంత్రికి లేఖలు రాస్తామన్నారు. అధికారులు పంట నష్టం సర్వే నిర్వహించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, బీజేపీ రాష్ట్రనాయకులు డా.రఘు, బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి, నాయకులు చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, బొడ్ల రమేష్, సుంచు రణధీర్, బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కార్మికులకు పనిగంటల పెంపు

● లేబర్‌కోడ్‌లతో కార్మికులను బానిసలుగా మార్చేందుకు కుట్ర
● మే డేను విజయవంతం చేయాలి
● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు


సిరిసిల్లలో మేడే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 21 (అంధ్రజ్యోతి): దేశంలో బీజేపీపాలిత రాష్ట్రాల్లో కార్మికులకు పని గంటల పెంపు, లేబర్‌కోడ్‌లతో కార్మికులను బానిసలు మార్చేందుకు కుట్రలు పన్నుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో సోమవారం మేడే సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను సీపీఎం నాయకులతోకలిసి రాష్ట్రకమిటీసభ్యుడు స్కైలాబ్‌బాబు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దు చేస్తు నాలుగులేబర్‌కోడ్‌లను తీసుకరావటమే కాకుండా కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ విధానాలపై కార్మికుల ఉద్యమాలను చేపట్టాలని మేడే సందర్భంగా అంతర్జాతీయ శ్రామికదినోత్సవాన్ని గ్రామాలతోపాటు అన్ని వార్డులల్లో ఎర్రజెండాలను ఎగురవేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక చట్టాల సవరణ ద్వారా కార్మికులను యజమానులకు పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే కుట్ర జరుగుతుందన్నారు. కార్మిక చట్టాలను సవరణ చేస్తే 8 గంటల స్థానంలో 12గంటల పనిదినాలు అమలు అవుతాయని అన్నారు కార్మికులపై పనిగంటలు పెంచి పెట్టుబడిదారులకు ఆదాయాన్ని సమకూర్చడానికి కేంద్ర మే లేబర్‌కోడ్‌లను తీసుకొస్తున్నదని విమర్శించారు. కార్మికవర్గం కార్మిక చట్టాల సవరణపై తిరగబడకపోతే కార్మికులు యజమానులు పెట్టుబడిదారులకు బానిసలుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. మే 1న అంతర్జాతీయ కార్మిక కష్టజీవుల దినోత్సవాన్ని గ్రామ గ్రామాన వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ అధ్యక్షత వహించగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి. జవ్వాజి విమల, కోడం రమణ మల్లారపు అరుణ్ కుమార్ జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య అన్నల్దాస్ గణేష్ సూరం పద్మ రమేష్ చంద్ర వివిధ ప్రజా సంఘాల నాయకులు రామంచ అశోక్ సిరిమల్లె సత్యం. కుమ్మరి కుంట కిషన్,నరేందర్ ఎస్ రాములు దినకర్ నక్క, దేవదాస్ సురేష్ కమలాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థి శిరీష

ధర్మారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలో దొంగతుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రేవెల్లి శిరీష ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 25 నుంచి 29 వరకు మహారాష్ట్రలోని కొల్లాపూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే పోటీల్లో తెలంగాణ తరుపున శిరీష ఆడనుంది. జాతీయ స్థాయికి ఎంపికైన శిరీషను ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## ఓటమి భయంతోనే ఎన్నికలు నిర్వహించడం లేదు

ముత్తారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదని బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు పోతుపేద్ది కిషన్‌రెడ్డి సోమవారం ఆరోపించారు. ఎన్నికలు నిర్వహించక పోవడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధులు రాక గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీలు 420హామీలు అమలు చేయలేక ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకొందన్నారు. అందుకే ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం భయపడుతుందని పేర్కొన్నారు.

## యాదవ సంఘం కార్యవర్గం

మంథనిరూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రచ్చపల్లి యాదవ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షుడిగా ఏదండ్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆసరి నాగరాజు, డైరెక్టర్లుగా కొమురయ్య, జాగిరి సంజీవ్, తొడారి కుమార్, ఓదమ్మ, కనవేన రజిత, రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శివప్రసాద్ వ్యవహరించారు.

# కటింగ్‌ల పేరుతో రైతులను దోచుకున్న బీఆర్ఎస్

గోదావరిఖని, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కటింగ్‌ల పేర రైతుల కష్టాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పెద్దలు దోచుకున్నారని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. సోమవారం జనగామలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పని చేస్తుందన్నారు. రుణమాఫీ, రూ.500బోనస్‌తో రైతుల్లో భరోసా పెరిగిందని, వ్యవసాయం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లాభసాటి అని నమ్మకం కుదిరిందన్నారు. గత ప్రభుత్వం రైతుల శ్రమను దోచుకుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత కటింగ్‌లు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవినీతిని సహించేది లేదని, తాను అన్నీ కేంద్రాలపై నిఘా పెట్టానన్నారు. ధాన్యం అమ్మిన తరువాత తక్ పట్టీలను పొందిన రైతులకు 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. గత సీజన్‌లో సన్న వడ్లపై బోనస్‌ను నియోజకవర్గంలో అత్యధికంగా జనగామ రైతులే పొందారన్నారు. అన్నీ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నాయకులు జువ్వాడి మాధవరావు, విజయ్‌రావు, నారాయణ, జనగామ శివ, చెలుకల శ్రీను, కృపాకర్‌రావు, శ్రీధర్‌రావు, మహంకాళి స్వామి, గోపాల్‌రావు, సాంబమూర్తి, రమేష్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, చిన్నఓదాలలో ప్రారంభిస్తున్న కొత్త శ్రీనివాస్

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గోపాల్‌పూర్, చిన్నఓదాల, బిట్టుపల్లి, గద్దలపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, డైరెక్టర్లు సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డైరెక్టర్లు మాచీడి రాజుగౌడ్, రావికంటి సతీష్, కొత్త శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాజయ్య, రాజమల్లు, సంఘం సెక్రటరీ అశోక్‌లు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్దపల్లి నుంచి పదివేల మంది తరలిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ అని, తెలంగాణ ఆత్మగౌరానికి ప్రతీక అని, తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా పనిచేశామో అదేవిధంగా పనిచేస్తూ మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తీసుకురావాలన్నారు. పార్టీ స్థాపించి 25వ సంవత్సరంలో అడుగెడుతున్న సందర్భంగా ఈనెల 27న నిర్వహించే సభను విజయవంతం చేయాలన్నారు. ప్రజలను తరలించేందుకు వాహనాలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేసినట్లు వివరించారు. 27 ఉదయం 11 గంటల నుంచి వాహనాలు బయలు దేరుతాయన్నారు. సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మర్కు లక్ష్మన్, బాలాజీరావు, వెంకటరెడ్డి, ఉప్పు రాజ్‌కుమార్, బండారి శ్రీనివాస్, సయ్యద్ మోబిన్,దేవయ్య, చంద్ర శేఖర్, సతీష్,నట్‌రాజ్, అతిక్ తదితరులున్నారు.

**మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి):** గుంజపడుగు, గద్దలపల్లి గ్రామాల్లో ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను బీఆర్ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్‌లు సోమవారం ఆవిష్కరించారు. గ్రామాల్లో నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, తెలంగాణ అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. విజయ్‌కుమార్, కుంట రాజు, వెంకటేష్, బాపు పాల్గొన్నారు.

## ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం రాత్రి చంద్రశేఖర్‌నగర్‌లోని ఒరియా గుడిసెలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, కౌటం సతీష్ ఉన్నారు.

## నీరా సేవించడం ఆరోగ్యానికి మంచిది

సుల్తానాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సిద్ధంగా లభించే నీరా సేవించడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని, వేసవిలో నీరా తాగడం ద్వారా చలువ చేస్తుందని రాష్ట్ర గౌడ సంఘం నాయకులు గడ్డం సత్యనారాయణ, గీత పారిశ్రామిక సంఘం నేతలు అంతటి లచ్చయ్య, తిరుపతి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు అన్నారు. సోమవారం కల్లు మండువా వద్ద గల ఎల్లమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాటి నీరా అమ్మకాలను ప్రారంభించారు. ఈత చెట్ల నుంచి నీరా లభించడం అందరికీ తెలిసిందే కానీ ఒక ప్రత్యేక పద్ధతి ప్రకారంగా తాటి చెట్ల నుంచి కూడా నీరాను తయారు చేయవచ్చని ఇక్కడి గీత కార్మికులు ప్రయోగాత్మకంగా నిరూపించారు. ఈ సందర్భంగా పలువురికి నీరాను ఉచితంగా పంపిణీ చేశారు.

## పాఠశాలలో మూత్రశాలల నిర్మాణానికి భూమిపూజ

ఎలిగేడు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాములపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మూత్రశాలల నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన దాస్‌సేవాసమితీ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. మారుమూల గ్రామాలలో పాఠశాలల మౌలిక వసతుల కల్పనలో భాగంగా నిర్మాణానికి ముందుకువచ్చినట్లు సేవాసమితి ప్రతినిధి దదాది రవి పేర్కొన్నారు. వీటి నిర్మాణం ఇంజనీరింగ్ ప్లాన్ ప్రకారం నిర్మిస్తామని అంచనా వ్యయం రూ.8లక్షలు అవుతున్నాయని పేర్కొన్నారు. కార్యదర్శి రాచర్ల హరిబాబు, హెచ్ఎం శ్రీవాణి, అమ్మఆదర్శ పాఠశాల ఛైర్మన్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం

జూలపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో రైతుల భూమి సమస్యలు పరిష్కారం అవుతాయని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో భూ భారతి చట్టంపై సోమవారం రైతులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు.

బీఆర్ఎస్ హయాంలో తీసుకువచ్చిన ధరణి స్థానంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూ భారతి కొత్త చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తహసీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపీడీవో పద్మజ, ఎంపీఓ అనిల్ రెడ్డి, ఏవో ప్రత్యూష, డిటి అనిల్‌కుమార్, విండో ఛైర్మెన్ వేణుగోపాల్‌రావు, ఆర్ఐ రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణు

## రేణుక ఎల్లమ్మతల్లికి జలాభిషేకం



జలాభిషేకానికి తరలివస్తున్న గీత కార్మికులు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గంగారం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ కొలువులో భాగంగా సోమవారం ఎల్లమ్మతల్లికి జలాభిషేకం నిర్వహించారు. గౌడసంఘం గ్రామశాఖ అధ్యక్షుడు మేడి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ కొలుపు ఆదివారంతో ప్రారం భమై మంగళవారం బోనాలతో ముగుస్తుందన్నారు. ఉపాధ్యక్షుడు పెరుమండ్ల కనకయ్య, తాళ్లపెల్లి శ్రీనివాస్, మేడి తిరుపతి, మేడి శ్రీనివాస్, ఏరుకొండ శ్రీని వాస్, మేడి రాయమల్లు, మేడి సతీష్, భూమయ్య, పాలకుర్తి పరశురాములు, పాల్గొన్నారు.

# పాఠశాలలకు బెంచీలు, కుర్చీల వితరణ



సుల్తానాబాద్‌లో డెస్క్, బెంచీలు అందించిన హెచ్ఎం శారద, కుర్చీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డెస్క్, బెంచీలు లేక ఇబ్బంది పడుతుండడంతో ప్రధానోపాధ్యాయురాలు సొంత డబ్బులతో డ్యూయల్ డెస్క్, బెంచీలను సమకూర్చారు. సుల్తానాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పని చేస్తున్న అమిరిశెట్టి శారద విద్యార్థుల కోసం నలభై వేల రూపాయల విలువ గల బెంచీలను కొనుగోలు చేసి స్కూల్‌లో ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయురాలిని పలువురు అభినందించారు.

**ధర్మారం, (ఆంధ్రజ్యోతి):** మేడారం ఉన్నత పాఠశాలలో 1994 - 1995 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు 12 కుర్చీలను బహుకరించారు. ఇటీవల పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు ఉపయోగకరంగా ఉండేందుకు కుర్చీలు ఇవ్వాలని నిర్ణయించుకుని సోమవారం అందజేశామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వసంత హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాల ఇంచార్జ్ రాజకుమార్‌తో పాటు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఆకారి రాజేశం, ప్రవీణ్, తోకల వంశీ, పెంచికల లింగమూర్తి, అవునూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు

గోదావరిఖని, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ రూ.25కోట్లతో నిర్మిస్తున్న ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ప్రాజెక్టు వల్ల సింగరేణి కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరు లభిస్తుందని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. సోమవారం జీడీకే1ఇంక్లైన్ వద్ద సింగరేణి నిర్మిస్తున్న ర్యాపిడ్ ఫిల్టర్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, సివిల్ అధికారులు ఆయనకు ప్రాజెక్టు పురోగతి గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరి జలాలు కలుషితమై తాగునీటికి ఇబ్బంది అవుతున్న పరిస్థితుల్లో గోదావరిఖనిలో సింగరేణి ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ ప్రాజెక్టు చేపట్టడం అభినందనీయమన్నారు. దీంతో గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీ కాలనీలోని కార్మిక కుటుంబాలకు సురక్షితమైన నీటిని అందిస్తామన్నారు. నియోజకవర్గంలో రూ.700కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రూ.200కోట్లతో రోడ్లు, డ్రైన్లు, ఎస్‌టీపీ నిర్మాణం జరుగుతుందన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

### దోభీఘాట్లు ప్రారంభం

సింగరేణి సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో జనగామ రజకుల కోసం నిర్మించిన దోబీఘాట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ నిధులతో దోబీఘాట్, మరుగుదొడ్లు, వాటర్‌ట్యాంక్, రెస్ట్ షెల్టర్లను నిర్మించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి పరిసర, ప్రభావిత గ్రామాల్లో సామాజిక బాధ్యతగా నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఏరియా ఇంజనీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, డీజీఎం(ఫారెస్ట్) కరుణ, సివిల్ ఎస్ఈ వరప్రసాద్, డీవైఎస్ఈ ప్రశాంత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పోలుసాని శ్రీనివాస్, ముస్తాఫా, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, శివ, సాయిలు, నారాయణ, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.




## సింగరేణిలో జీవో 33 అమలుకు ఆదేశాలివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో జీవో 33 అమలయ్యే విధంగా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌కు విజ్ఞప్తి చేసింది. సోమవారం గోదావరిఖనిలో ఆయనను కలిసిన అసోసియేషన్ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. జీఓ ద్వారా సింగరేణి ఉద్యోగాల భర్తీలో ఎస్సీ సామాజిక వర్గానికి 9శాతం రిజర్వేషన్ లభిస్తుందని తెలిపారు. సింగరేణిలో 9 శాతం రిజర్వేషన్ అమలుకు లైజనింగ్ ఆఫీసర్‌లను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మాదిగ, మాదిగ ఉప కులాలకు ఉద్యోగ నియామకాల్లో 9 శాతం అమలు చేయడం, అన్ని ఏరియాల్లో అసోసియేషన్‌కు కార్యాలయాల ఏర్పాటు చేసేలా సంస్థ సీఎండీకి సూచించాలని, అసోసియేషన్ 365/22కు తగిన గుర్తింపు ఇచ్చేలా యాజమాన్యానికి లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ దుర్గాప్రసాద్, అధ్యక్షుడు బొంకూరి మోహన్, సభ్యులు శ్రావణ్, అడ్మాపురం చంద్రమౌళి, లక్ష్మీరాజం, శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

## గ్రేడ్-3 పోస్టుల భర్తీకి రాత పరీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో ఖాళీగా ఉన్న గ్రేడ్-3 పోస్టులకు సోమవారం యాజమాన్యం రాత పరీక్షలు నిర్వహించింది. ఓసీపీ-3లో 11 డంప్ మ్యాన్, ట్రిప్ మ్యాన్ పోస్టులు ఖాళీ ఉండగా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా 110 మంది దరఖాస్తు చేసుకున్నారు. సెక్టార్-3 సింగరేణి హైస్కూల్‌లో జరిగిన పరీక్షలకు109 మంది హాజరయ్యారు. సాయంత్రం జీఎం కార్యాలయ నోటీస్ బోర్డులో ఫలితాలను ప్రకటించారు. ఎస్వోటూ జీఎం రాముడు పరీక్షల నిర్వహణను పరిశీలించారు. డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈ) మురళీకృష్ణ, పాఠశాల హెచ్ఎం సుందర్‌రావు పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు.

## సింగరేణి స్కూల్ సిబ్బందిని అభినందించిన నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సెక్టార్-3 సింగరేణి స్కూల్ సిబ్బందిని సోమవారం కాంగ్రెస్ నాయకులు అభినందించారు. పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ బోధనకు అనుమతులు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని హెచ్ఎం సుందర్‌రావుని సన్మానించారు. సీబీఎస్ఈ బోర్డు అనుమతులు వచ్చేలా పాఠశాలను నిబంధనలకు అనుగుణంగా ఆధునీకరించడం, ల్యాబ్, లైబ్రరీ వంటి సదుపాయాలు కల్పించేలా కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు. కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అవినాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేష్, జక్కుల దామోదర్‌రావు, చక్రపాణి, సదానందం, రాములు, కేశవులు, సారయ్యనాయక్ పాల్గొన్నారు.

## గోదావరి నీటి శుద్ధికి కార్యాచరణ

(5వ పేజీ తరువాయి)

కృష్ణనగర్, అన్నపూర్ణకాలనీ నుంచి వచ్చే రామకృష్ణ టాకీస్ నాలా, గోదావరిఖని పట్టణం పడమర వైపు మార్కండేయకాలనీ, దుర్గానగర్, గణేష్‌నగర్, గాంధీనగర్, ఐబీకాలనీతోపాటు ఎఫ్‌సీఐ ఏరియా నుంచి వచ్చే రెండు ప్రధాన నాలాలను మల్కాపురం వద్ద ట్రీట్‌మెంట్ చేసేందుకు 21ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. యైటింక్లయిన్‌కాలనీ, అల్లూరు ఏరియా ప్రాంతాల్లో నీరు వాగులో కలువకుండా ఆరు ఎంఎల్‌డీల సామర్థ్యం గల ఎస్‌టీపీని నిర్మిస్తున్నారు.

### నాలాల వద్దే ఐఎస్‌డీలు...

వ్యర్థ జలాలను ఎస్‌టీపీలకు మళ్లించేందుకు నాలాల వద్ద ఇంటర్ సెక్షన్ అండ్ డైవర్షన్ వర్క్స్‌ను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నాలాలకు అడ్డుగా చెక్ డ్యామ్‌ల మాదిరిగా ఐఎస్‌డీ నిర్మించి అక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా వెట్‌వెల్‌లకు వ్యర్థ జలాలను మళ్లిస్తారు. ఎస్‌టీపీల సామర్థ్యం బట్టి 9మీటర్ల వైశాల్యంతో 10 నుంచి 15మీటర్ల లోతుతో ఈ వెల్స్‌ను నిర్మిస్తారు. ఇక్కడి నుంచి సీక్వెన్సి బ్యాచ్ రియాక్టర్ (ఎస్‌బీఆర్) టెక్నాలజీ నిర్మించిన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు మళ్లిస్తారు. అక్కడ మూడు అంచెల్లో నీటిని శుద్ధి చేసిన అనంతరం క్లోరినేషన్ చేసి నదిలోకి విడుదల చేస్తారు.

రామగుండానికి అమృత్ పథకంలో రూ.255.82కోట్లు మంజూరయ్యాయి. దీనిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు ఎస్‌టీపీలు, డైవర్షన్ చానళ్ల, డ్రైన్లు నిర్మించాల్సి ఉంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రామగుండం నగర పాలక సంస్థ కూడా వాటా చెల్లించాల్సి ఉంటుంది. ఎస్‌టీపీల నిర్మాణం అత్యావసరం కావడంతో ముందుగా కేంద్రం నుంచి మంజూరైన రూ.88కోట్లతో ఎస్‌టీపీల నిర్మాణం మొదలు పెట్టారు.

### ఏడాదిలో ఎస్‌టీపీలు అందుబాటులోకి

**ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్**

రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఎస్‌టీపీల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఏడాదిలో ఈ పనులు పూర్తి చేసేలా సంబంధిత ఏజెన్సీలపై ఒత్తిడి పెంచాం. ప్రజారోగ్యాశాఖ ఏజెన్సీలు సమన్వయంతో పనులు త్వరితగతిన చేసేలా చర్యలు చేపట్టాం. నగరంలో మరికొన్ని నాలాలను ఆధునీకరించి ఎస్‌టీపీలకు అనుసంధానం చేస్తారు. వ్యర్థాలు లేని గోదావరిని చూసేలా చర్యలు చేపట్టాం.

## విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాలి



యూకేజీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసిన నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగంలో విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దితేనే వారు అనుకున్నది సాధిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థ అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన యూకేజీ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతు నిష్ణాతులైన అధ్యాపకులచే నిత్య శిక్షణతో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నామని, దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా ప్రతిభను చాటుతున్నారన్నారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

రామగిరి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): శాంతియుతంగా చేస్తున్న సమ్మెను విచ్ఛినం చేయడం కోసం ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులను హైదరాబాద్‌లో అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ సోమవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు మోకాళ్ల పైన కూర్చొని వినూత్న నిరసన తెలిపారు. రెగ్యులర్ చేయాలనే ప్రధాన డిమాండ్‌పై చేస్తున్న సమ్మె మూడోరోజుకు చేరింది. కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీలో ఫుట్‌బాల్ పోటీలు

జ్యోతినగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీలో సోమవారం రాత్రి ఇంటర్ డిపార్ట్‌మెంటల్ ఫుట్‌బాల్ పోటీలు(మెన్స్ ఫుట్‌బాల్ ప్రీమియర్ లీగ్) మహాత్మగాంధీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలలో రామగుండం, తెలంగాణ ప్రాజెక్టులకు చెందిన 4 జట్లు పాల్గొంటున్నాయి. ఎన్టీపీసీ జీఎం త్రిపాఠి పోటీలను ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో అధికారులు, క్రీడాకారులు, ఉదోగులు పాల్గొన్నారు.

## తాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలి

పాలకుర్తి,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మక్కాన్ సింగ్ సేవసమితి ఛైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ నిర్వాహకులకు సూచించారు. సోమవారం ఈసాలతక్కళ్లపల్లి, రామారావుపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి వారితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు వంద రోజులు పని కల్పిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరచడమే లక్ష్యంగా నిర్వాహకులు పని చేయాలన్నారు. ఉపాధి హామీతో గ్రామీణ ప్రజలకు ఆర్థిక భద్రత లభిస్తుందని, మస్టర్లలో కోతలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. మార్కెట్ కమిటీ ఛైర్మెన్ గడ్డం తిరుపతి,కన్నాల పీఏసీఎస్ ఛైర్మెన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, పాల్గొన్నారు.

## కాటమయ్య రక్షాకవచ్ వినియోగంపై శిక్షణ

కమాన్‌పూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పిల్లిపల్లె రేణుక ఎల్లమ్మగుడి వద్ద బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పెద్దపల్లి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మంథని ఆధ్వర్యంలో సోమవారం కమాన్‌పూర్, జూలపల్లి, పేరపల్లి, పెంచికల్‌పేట మొదలగు గ్రామాలలోని గౌడవృత్తి దారులకు కాటమయ్య రక్షాకవచ్ గురించి శిక్షణ ఇచ్చారు. తాటిచెట్టుపై నుండి ప్రమాదవశాత్తు జారికిందపడి ప్రమాదాలు జరగకుండా శిక్షణ ఇచ్చి కాటమయ్య రక్షణకవచ్ అందజేశారు. ఎక్సైజ్ సిబ్బంది సాయికుమార్, ఎస్సై మహేందర్, శ్యామ్, నిరంజన్, శ్రీను, రవి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో పోషణ్ పక్వాడ్ అభియాన్




విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ అరుణ

ధర్మారం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయుష్ హోమియో డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి రక్తహీనతను గుర్తించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ అరుణ విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలమని, చదువుపై ఏకాగ్రత నిలిపి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుటకు ఆరోగ్యం దోహద పడుతుందన్నారు. మంజుల-సుధాకర్‌లు విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి ఆసానాలు వేయించారు. డాక్టర్ అమర్నాథ్, ఎస్ఎన్ఓ విమల్ కుమార్, ఏఎన్ఎం ఊర్మిళ, ఆశా కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయురాలు మధవి లత తదితరులు పాల్గొన్నారు.